ఏదీ నాటి..దూకుడు!

- సంచలనాత్మక కేసుల ఛేదనలో తడబడుతున్న నగర పోలీసులు
- టాస్క్ పెద్దది.. ఫోర్స్ చిన్నది..!
- 48 గంటల్లో ఛేదించే టార్గెట్ ఏమయ్యింది..
- నాడు సిటీ పోలీసులను చూస్తే అంతర్రాష్ట్ర ముఠాలకు ముచ్చమటలు
- నేడు ఈజీగా తప్పించుకుంటున్న దోపిడీ దొంగలు
- మూడు కమిషనరేట్ల మధ్య కొరవడిన సమన్వయం

సిటీబ్యూరో, జనవరి 22(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పోలీసులంటే అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠాలకు హడల్.. ఎంత చాకచక్యంగా నేరాలు చేసినా హైదరాబాద్ పోలీసులు పట్టుకుంటారనే భయం వారిలో ఉండేది.. ఇదంతా గత పదేండ్ల కిందట వరకు... నేడు ఆ భయం పోయింది. హైదరాబాద్‌లో నేరాలు జరుగొద్దు.. జరిగితే 24 గంటల నుంచి 48 గంటల్లో ఛేదించాలనే పట్టుదలతో పోలీసులు ఆయా కేసులను ఛేదించే వారు. ఇందులో ప్రధానంగా టాస్క్‌ఫోర్స్ కీలకం పాత్ర పోషించేది. నేడు టాస్క్ పెద్దదైనా అంత ఫోర్స్ అందులో కన్పించడం లేదనే వాదన కన్పిస్తోంది. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన కాల్పుల ఘటన జరిగి వారం రోజులు కావస్తున్నా ఇంకా దొంగల జాడ కనిపెట్టలేకపోవడంలో పోలీసులు విఫలం కావడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ కేసు ఛేదించడానికి శాంతి భద్రతల పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ బృందాలు రంగంలోకి దిగాయి. వీరికి తోడు కర్ణాటక పోలీసులు కూడా ప్రత్యేక బృందాలతో గాలింపు చేస్తున్నారు. ఈ రెండు రాష్ట్రాల పోలీసులకు ఇప్పుడు ఇద్దరు దోపిడీ దొంగలు మోస్ట్‌వాంటెడ్‌గా మారారు. ఇలాంటి సంచల నాత్మకమైన ఘటనలను ఈజీగా హైదరాబాద్ పోలీసులు ఛేదించి దేశంలోనే బెస్ట్ పోలీసింగ్‌గా పేరు తెచ్చుకున్నారు. ప్రభుత్వాలు మారినా అదే యంత్రాంగం పనిచేస్తోంది.. అయితే పని చేయడంలోనే అప్పటిలా ఉత్సాహం చూపకపోవడానికి కారణమేమిటీ... ఆయా విభాగాల మధ్య సమన్వయం ఎలా ఉంది, మనకెందుకు ఫలానా టీమ్ అక్కడకు వెళ్లింది కదా అనే ధోరణితో ఒకరిపై ఒకరు వేసుకొని కేసు ఛేదనలో చతికిల పడుతున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో టాస్క్‌ఫోర్స్ మాదిరిగానే సీసీఎస్ బృందాలు కూడా కీలకంగా పనిచేయాలనే ఆలోచనతో సీసీఎస్‌ను బలోపేతం చేశారు. అయితే సీసీఎస్‌ను బలోపేతం చేసి రెండేండ్లవుతున్నా ఇప్పటి వరకు కీలక కేసులను ఛేదించలేదు, దానికి తోడు అవినీతి, అక్రమాలు గత ఏడాది ముఠా కట్టుకొని విమర్శలకు గురయ్యారు.

కొన్ని సంఘటనలు

- తెలంగాణ ఏర్పాటైన 2014, నవంబర్‌లో హైదరాబాద్‌లో సీసీ కెమెరాలు కూడా అంతగా లేవు. ఆ సమయంలో కేబీఆర్ పార్కు వద్ద వాకింగ్ చేస్తున్న ఒక ఫార్మ కంపెనీ యజమానిని లక్ష్యంగా చేసుకొని ఏకే 47తో కాల్పులు జరిపి భయభ్రాంతులకు గురిచేసి కిడ్నాప్‌కు దుండగుడు విఫలయత్నం చేశాడు. అది సాధ్యం కాకపోవడంతో గన్ అక్కడే వదిలేసి పరారయ్యాడు. రంగంలోకి దిగిన పోలీసులు 24 గంటల్లో నిందితుడిని గుర్తించి 48 గంటల్లోపు నిందితుడు పోలీస్ డిపార్టుమెంట్‌లో పనిచేసిన కానిస్టేబుల్‌గా గుర్తించి కర్నూల్‌లో అరెస్ట్ చేసి నగరానికి తరలించారు. ఇక్కడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వేగంగా స్పందించి నిందితుడిని పట్టుకోడంలో కీలకంగా వ్యవహరించారు.
- 2016లో షాహినాథ్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓనగర్‌లో నివాసముండే పదో తరగతి చదువుతున్న వ్యాపారి కొడుకును కిడ్నాప్ చేసి దుండగులు హత్య చేశారు. మృతదేహాన్ని సికింద్రాబాద్ అల్వా హోటల్ వద్ద బాక్స్‌లో చుట్టి పడేసి వెళ్లిపోయారు. దీనిపై నగర పోలీసులు వేగంగా స్పందించి నిందితులను 24 గంటల్లోనే గుర్తించారు. కిడ్నాపర్లు ముందుగా బాలుడితో పరిచయం పెంచుకున్నారు.. ఆ తరువాత నమ్మించి అతడిని నమ్మించి ద్విచక్రవాహనంపై తీసికెళ్లి, ఆ తరువాత కిడ్నాపర్లు ఒక కారులో బాలుడిని కట్టి బంధించారు. ఈ క్రమంలోనే అరవకుండా బాలుడి నోటికి ప్లాస్టర్ వేయడంతో ఊపిరాడక మృతి చెందాడు. అయినా బాలుడి తండ్రికి ఫోన్ చేసి రూ.10 కోట్లు కావాలంటూ డిమాండ్ చేశారు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుల ఆచూకీని గుర్తించారు. మరో 24 గంటల్లో నిందితులను పట్టుకున్నారు. ఈ కేసులోను టాస్క్‌ఫోర్స్ కీలకంగా వ్యవహరించింది.
- 2018లో నిజాం మ్యూజియంలో దొంగలు పడ్డారు. వంద కోట్ల రూపాయల విలువైన వజ్ర వైడ్యూరాలతో కూడిన వస్తువులను మ్యూజియం నుంచి దొంగలు కొట్టేశారు. 45 రోజుల పాటు రెక్కీ నిర్వహించి, పోలీసులకు ఆధారాలు దొరకకుండా ఉండేలా దొంగలు ఈ దొంగతనానికి పాల్పడ్డారు. ఈ కేసులో క్లూస్ టీమ్ ఇచ్చిన కొన్ని ఆధారాలు, సీసీ కెమెరాలలోని దొరికిన కొన్ని వీడియోలు పోలీసులకు కీలకంగా మారాయి. దీనిని ఛేదించేందుకు టాస్క్ ఫోర్స్ పోలీసులు పక్క రాష్ట్రాలలోనూ గాలింపు చేపట్టాయి. అయితే వారం రోజులలోపే ఈ కేసును పోలీసులు ఛేదించారు, పోయిన సొత్తు మొత్తాన్ని రికవరీ చేసి, సిటీ పోలీస్ దర్యాప్తులలో బెస్ట్ అని రుజువు చేసుకున్నారు.
- ఒక రాజకీయ నాయకుడి ఇంట్లోకి చొరబడిన దుండగులు కాల్పులు జరిపి పరారయ్యారని, ఆ కాల్పులలో అతనికి గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. ఇంట్లోకి వచ్చి కాల్పులు జరిపిన దుండగులు ధైర్యంగా హైదరాబాద్‌ను వదిలేసి వెళ్లిపోయారంటూ వార్తలు వెలవడ్డాయి. అయితే కాల్పుల ఘటనపై భిన్న కోణాల్లో దర్యాప్తు జరిపిన పోలీసులు ఇది ఫ్యాక్షనిస్టుల పనా? ఉగ్రవాదులా? ప్రత్యర్థులా? దోపిడీ దొంగలా? ఆస్తుల గొడవలలో జరిగిందా? అనే కోణాలలో దర్యాప్తు జరిపారు. అయితే ఇవి దుండగులు కాల్చిన కాల్పులు కాదని, ఏదో ఇందులో జరిగి ఉంటుందనే కోణం పోలీసులు దర్యాప్తు జరిపి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయించారు. చివరకు ఆ నాయకుడే తనకు తానుగా కాల్పులు జరిపించుకొని ఒక సంచలనం సృష్టించాలని తద్వారా ప్రజల సానుభూతి పొందాలని భావించాడని వెల్లడయ్యింది. ఈ కేసును కూడా 48 గంటల్లోనే పోలీసులు నిర్ధారించారు.

కొరవడుతున్న సమన్వయం..!

నేడు మూడు పోలీస్ కమిషనరేట్లతో పాటు స్థానికంగా ఉండే జూన్‌లు, డివిజన్‌లోని ఆయా ఠాణాల మధ్యనే సమన్వయం కొరవడుతుంది. ఇటీవల అష్టలగ్‌గండ్‌లో జరిగిన కాల్పుల ఘటనలోని నిందితులు కూడా అష్టలగ్‌గండ్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లి, సికింద్రాబాద్ నుంచి గజ్వేల్ వెళ్లేందుకు ప్లాన్ చేసి తిరుమలగిరిలో దిగిపోయినట్లు బయటకు వచ్చింది. ఆ తరువాత రూట్‌పై స్పష్టత రావడం లేదు, సీసీ కెమెరాలు కూడా నగరంలో అక్కడక్కడ పనిచేయకపోవడంతో సమస్య వస్తోంది. దీనికి తోడు దర్యాప్తు విభాగాల మధ్య సమన్వయం కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి. ఎవరు కూడా దీనిపై పూర్తి బాధ్యత తీసుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హైదరాబాద్ పోలీసింగ్‌లో మార్పులు చేసుకున్నాయి. ఒక్కసారిగా నేరాలు పెరగడం, దోపిడీ దొంగతనాలకు నిలయంగా మారడంతో ప్రభుత్వం కండ్లు తెరిచి నగర పోలీస్ బాస్‌ను బదిలీ చేసింది. కొత్తగా వచ్చిన బాస్ ఐదు నెలలుగా పోలీస్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు శ్రమిస్తున్నారు. కొంత వరకు గాడిలో పడినా, పూర్తిస్థాయిలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసే విధంగా పట్టు సాధించేలా మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని పోలీసు శాఖలో చర్చించుకుంటున్నారు.

యువకుడు ఆత్మహత్య

జీడిమెట్ల, జనవరి 22: తన ప్రేమను కుటుంబ సభ్యులు నిరాకరించడంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం, చిట్టనూర్ గ్రామానికి చెందిన గోకరమ్మ మహేందర్ చిన్న వయస్సులోనే ఉన్నప్పుడు తన తండ్రి మృతి చెందడంతో తన తల్లి , తమ్ముడుతో కలిసి ఉంటున్నారు. బతుకుదెరువు కోసం గత 18 ఏండ్ల కిందట హైదరాబాద్‌కు వలస వచ్చి చింతల్ శ్రీనివాస్‌నగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకుని తన తల్లి, తమ్ముడు శివ కుమార్ (22)తో కలిసి ఉంటున్నారు. అయితే సంక్రాంతి పండుగకు మహేందర్ తన ఊరికి తన తల్లితో కలిసి ఈనెల 6వ తేదీన వెళ్లారు. తన తమ్ముడు డ్రైవర్ పనులు చేస్తుండటంతో ఈనెల 13న వచ్చి తిరిగి 19వ తేదీన చింతల్ శ్రీనివాస్‌నగర్‌కు వచ్చాడు. తన తమ్ముడు ఒక్కడే ఉంటుండటంతో తన స్నేహితులు అతడి వద్దకు అప్పుడప్పుడు వెళ్తున్నారు. ఈనెల 21న రాత్రి తన తమ్ముడి స్నేహితుడు నిఖిల్ ఫోన్ చేసి శివకుమార్ తను ఉంటున్న గదిలో చీరతో బెడ్ రూమ్‌లో వెంటిలెటర్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపాడు. అయితే తన తమ్ముడు ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడని, ఇంట్లో తెలియడంతో అతడికి నచ్చజెప్పామని, అదే విషయంలో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడు సోదరుడు మహేందర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

7వేల కిలోల నల్లబెల్లం పట్టివేత

పోలీసులు స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, 40 కేజీల పటిక, చిత్రంలో నిందితులు

ఆర్కేపురం, జనవరి 22: దాదాపు 7వేల కేజీలకు పైగా నల్ల బెల్లం, 40కేజీల పటిక స్వాధీనం చేసుకొని నలుగురుని అరెస్టు చేసిన సంఘటన సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. బుధవారం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కిషన్ వివరాలు వెల్లడించారు. సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ కమిషనర్ కమలహాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించడంతో పహాడిషరీఫ్‌లో దాదాపు 7860 కిలోల నల్ల బెల్లం, 40 కిలోల స్పటికమును అక్రమంగా తరలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు తెలిపారు. కర్ణాటక నుంచి హైదరాబాద్ పహాడిషరీఫ్‌కి అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. నిందితుల వద్ద నుంచి 7860 కిలోల నల్ల బెల్లం, 40 కిలోల స్పటిక, ఒక డీసీఎం, రెండు ఆటోలు, ఒక లక్ష రూ.7వేల 500 నగదు, 4 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శివకాంత్, కేతావత్ అరుణ్ నాయక్, సభవాత్ హీర్యాసింగ్, మహమ్మద్ బాబాలను అరెస్ట్ చేశామని, రామావత్ నరేశ్, కేతావాత్ శ్రీను నాయక్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ప్రమాదవశాత్తు కాలుజారి సెంట్రింగ్ కూలీ మృతి

మాదాపూర్, జనవరి 22: ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి ఓ కూలీ మృతి చెందిన ఘటన బుధవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్స్పెక్టర్ కృష్ణ మోహన్ తెలిపిన ప్రకారం...అంజయ్యనగర్‌లో నివాసం ఉంటున్న రాకేశ్ అలామ్(23) బతుకుదెరువు నిమిత్తం వాసవి స్కైలా కన్స్ట్రక్షన్‌లో సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 22వ తేదీన ఉదయం 10:45 గంటలకు ఎప్పటిలాగే కూలీకి వెళ్లిన రాకేశ్ 17వ అంతస్తులో సెంట్రింగ్ పనిచేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. తనతో పని చేసే తోటి కార్మికులు సమీపంలోని కిమ్స్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ 12:35గంటలకు మృతి చెందాడు. దీంతో మృతుడు అల్లుడు నహీం రాజా కన్స్ట్రక్షన్‌లో ఎటువంటి భద్రతాపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లె ప్రమాదం జరిగిందని ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాచకొండలో ముగిసిన స్పోర్ట్స్ మీట్

సిటీబ్యూరో, జనవరి 22(నమస్తే తెలంగాణ):పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని తమ కర్తవ్య నిర్వహణలో భాగంగా రేయింబవళ్లు పనిచేయాల్సి ఉంటుందని ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో మూడురోజుల పాటు జరిగిన వార్షిక స్పోర్ట్స్ మీట్-2025 బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు వ్యక్తుల మానసిక శారీరక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణ ద్వారా పోలీసులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసే అవకాశం ఉందన్నారు. అనంతరం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. రాచకొండలోని అన్ని జోన్లతోపాటు ఆయా విభాగాల నుంచి 25 క్రీడా విభాగాల్లో 8జట్లు, 1000 మంది పోలీసు క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, రన్నింగ్, చెస్, బ్యాడ్మింటన్ వంటి పలు రకాల ఇండోర్, ఔట్ డోర్ క్రీడా పోటీల్లో సిబ్బంది పాల్గొన్నారని, వారిని సీపీ అభినందించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. రాచకొండ కమిషనరేట్ డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాచకొండ పోలీస్ కమిషనరేట్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా బుధవారం జరిగిన టెన్నిస్ సింగిల్స్‌తో పాటు డబుల్స్‌లో ఇమాన్యుయెల్‌తో కలిసి విజేతగా నిలిచిన అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి



దేవరాజ్‌కు కేకే అభినందనలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి:పాకిస్థాన్‌లో జరిగే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో బరిలోకి దిగనున్న టీమ్‌ఇండియాకు మేనేజర్‌గా ఎంపికైన హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్‌ను కాంగ్రెస్ సీనియర్ నేత కేశవరావు అభినందించారు. బుధవారం కేకేను ఆయన నివాసంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి సీజే శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్టీపీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయంలో బుధవారం జాతీయ భద్రత మాసోత్సవంలో భాగంగా ఆర్టీఏ అధికారులు హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు వంద మంది డ్రైవర్లు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కొందరు డ్రైవర్లు దృష్టిలోపం, బీపీ, షుగర్ సమస్యలతో బాధపడుతున్నారని, వారికి అవసరమైన మెడిసిన్స్ అందించామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ పురుషోత్తం రెడ్డి, ఎంవీఐలు పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు ఏడేండ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జనవరి23(నమస్తే తెలంగాణ): ప్రేమించి పెద్దలసమక్షంలో పెండ్లి చేసుకున్న భార్యను అదనపు కట్నంకోసం వేధించి ఆత్మహత్యకు కారణమైన భర్త మహ్మద్ అసద్ అలీ(27)కు ఏడేండ్ల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 11వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి వై.జయప్రసాద్ తీర్పునిచ్చారు. అదనపు పీపీ వొద్యారపు రవికుమార్ కథనం ప్రకారం.. మలక్‌పేట్‌కు చెందిన నేహా ఫాతిమా(20)కు పంజాగుట్టకు చెందిన మహ్మద్ అసద్‌తో 2017లో కట్నకానుకలు ఇచ్చి ఘనంగా వివాహం జరిపించారు. వివాహనంతరం అసద్ కుటుంబసభ్యులతో కలిసి పంజాగుట్టలో నివాసం ఉండేవారు. అయితే అసద్, అతడి కుటుంబసభ్యులు అదనంగా డబ్బులు కావాలని నిత్యం తన భార్య నేహా ఫాతిమాతో గొడవపడేవాడు. దీంతో నేహాఫాతిమా పోలీసులను ఆశ్రయించగా.. కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. దీంతో నిందితుడు పంజాగుట్ట నుంచి తన నివాసాన్ని రాజేంద్రనగర్ పరిధిలోని ఖయ్యూంనగర్ మార్చి వేరు కాపురం ఉండేవాడు. నిందితుడు అసద్ మరింత వేధించడంతో జీవితంపై విరక్తి చెందిన నేహా తన మరణానికి భర్త, అతని కుటుంబసభ్యుల వేధింపులే కారణమని తెలుపుతూ 2018జూన్8న తన సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో రికార్డ్ చేసి కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ పోలీసులు నిందితుడితో పాటు అతడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం ప్రధాన నిందితుడైన అసద్‌కు శిక్ష విధిస్తూ తీర్పునిస్తూ అతడి తల్లిపై నేరారోపణ రుజువు కాకపోవడంతో ఆమెపై కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

చోరీలకు పాల్పడుతున్న ఒకరి రిమాండ్

బొల్లారం, జనవరి 22: తాళం వేసి ఉన్న ఇండ్లల్లో దొంగతనాలు చేస్తూ పట్టుబడ్డ నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపిన ప్రకారం...హైదరాబాద్ షాపూర్‌నగర్‌కు చెందిన ఏ1 నిందితుడు కిశోర్‌కుమార్ ఆలియాస్ జీజెన్(21), ఏ2 చిత్తారి భరత్(21) ఒల్డ్‌బోయిన్‌పల్లి హస్మత్‌పేటకు చెందిన యువకులు. జల్సాలకు అలవాటు పడి పగటి వేళల్లో రెక్కీ నిర్వహించి తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్నారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దృష్టి సారించి దర్యాప్తు చేపట్టారు. బోయిన్‌పల్లిలో సుమారు 150 సీసీ కెమెరాల పుటేజీలను గుర్తించి నిందితులను అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి వెండి వస్తువులు,వాచ్‌లు,సెల్‌ఫోన్లు,రెండు ఫోటో కెమెరాలు, ద్విచక్ర వాహనం సుమారు రూ.4లక్షల 60వేల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నార్త్‌జోన్ అదనపు డీసీపీ అశోక్,ఏసీపీ కృష్ణమూర్తి తలుపులు లోపలి నుంచి లాక్‌చేసే విధంగా చూసుకోవాలని, ఇంట్లో మనుషులు ఉన్నారనే అభిప్రాయం కల్పించడానికి ఇండ్ల వదిలి వెళ్లేప్పుడు లైట్లు వేసి ఉంచాలని సూచించారు. ఇంటి ప్రాంగణంలో సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్‌లు అమర్చుకోవాలన్నారు. క్రైం డీఎస్సై తుల్జారామ్,డీఐ సర్థార్ నాయక్,సిబ్బందిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

మెహిదీపట్నం, జనవరి 22: రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ దుర్మరణం చెందిన ఘటన హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. ఇన్స్పెక్టర్ మల్లేశ్ తెలిపిన ప్రకారం... మెహిదీపట్నంలో ఉన్న హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న యూ టర్న్ వద్ద ఆర్టీసీ బస్సు ఓ వృద్ధుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన వృద్ధుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ ఫొటోలో ఉన్న వృద్ధుడిని గుర్తు పట్టేవారు 8712660420 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

కొలనులో పడి బాలుడు మృతి

మృతిచెందిన బాలుడు

జగద్గిరిగుట్ట, జనవరి22:ఆలయ సమీపంలోని నీటి కొలనులో మునిగి బాలుడు మృతి చెందాడు. జగద్గిరిగుట్ట పోలీసుల వివరాల మేరకు .. గాజులరామారం డివిజన్ మహదేవపురం శివాలయం కొలనులో మంగళవారం గుర్తు తెలియని బాలుడు (15) మునిగిపోయాడని స్థానికులు సమాచారం ఇచ్చారు. ఇంతో డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో గాలించగా బుధవారం బాలుడి మృతదేహం లభ్యమైంది. పరిసరాల్లోని సీసీ కెమెరాలు పరిశీలించగా.. ప్రమాదానికి ముందు ముగ్గురు బాలురు కాలనీ పరిసరాల్లో తిరిగినట్టు నమోదైంది. వీరిలో ఒకరు చనిపోయినట్టు తేలింది. అతని దుస్తులు కొలను సమీపంలో లభ్యమయ్యా. దీంతో చనిపోయిన బాలుడి వివరాలు సేకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతుడి సంబంధీకులు పోలీసులను సంప్రదించాలని కోరతున్నారు. మృత దేహాన్ని గాంధీకి పంపి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో నగదు చోరీకి విఫలయత్నం

- సుల్తాన్‌బజార్ బ్యాంక్‌స్ట్రీట్‌లోని కొటక్ మహీంద్రా బ్యాంక్ ఏటీఎంలో ఘటన
- నిందితుడి అరెస్ట్, ద్విచక్ర వాహనం స్వాధీనం

నిందితుడు గౌతం రాజేశ్

సుల్తాన్‌బజార్, జనవరి 22: సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఏఈఎంలో డబ్బులకు చోరీకి విఫలయత్నం చేసి ఓ వ్యక్తి పోలీసులకి చిక్కి కటాకటాల పాలయ్యాడు. ఇన్స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన గౌతంరాజేశ్(29) వైజాగ్‌లోని కేజీహెచ్ హాస్పిటల్‌లోని క్యాంటీన్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, అతను మద్యానికి, సిగరెట్లు వంటి చెడు వ్యసనాలకు అలవాటుపడి పనిచేస్తూ వచ్చే ఆదాయం వ్యసనాలకు సరిపోకపోవడంతోపాటు విలాసవంతమైన జీవితాన్ని గడపడానికి డబ్బులు, ఫోన్‌లు, ఆ టో మొబైల్ చోరీలను ఎంచుకున్నాడు. దీంలో భాగంగా ఈనెల 19వ తేదీన రైలులో చర్లపల్లికి వచ్చి అక్కడ బస్సు, ఆటో ఎక్కేందుకు ట్రూఫిట్ క్యాబినెట్స్ కంపెనీ ముందు బస్టాప్‌కి వద్దకు వచ్చాడు. కాగా,అక్కడ రోడ్డు పక్కన హీరో స్ప్లెండర్(ఏపీ 24ఎఫ్ 3589) కీతో పార్క్ చేసి ఉన్నది. ఇది గమనించిన రాజేశ్ అందుబాటులో ఉన్న కీతో బైక్‌ను స్టార్ట్ చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. తదనంతరం ఆ బైక్‌ను వాడుకొని పడేసేందుకు యత్నించాడు. ఈనెల 21వ తేదీన బ్యాంక్ స్ట్రీట్ ప్రాంతంలో తిరుగుతుండగా.. సెక్యూరిటీగార్డు లేని కొటక్ మహీంద్రా బ్యాంక్ ఏటీఎం కనిపించింది. ఆ సమయంలో ప్రజల రద్దీ తక్కువగా ఉండటంతో ఇదే అదునుగా భావించిన రాజేశ్ ఏటీఎంలో దొంగతనం చేయాలని నిర్ణయించుకొని అందులోకి వెళ్లి ఏటీఎం మిషన్‌లో నగదు చోరీ చేసేందుకు యత్నించి విఫలమయ్యాడు. దీంతో ఆగ్రహంతో ఏటీఎం మిషన్‌ను బలంగా గుంజి కింద పడవేయడంతో ఏటీఎం మిషన్ పాడైంది. విషయం తెలుసుకున్న కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ మేనేజర్ ముల్లంపూడి రాంభూపాల్‌చౌదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడు గౌతంరాజేశ్‌ను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి హీరో స్ప్లెండర్ బైక్‌ను స్వాధీసం చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఓం శివదుర్గా జ్యోతిష్యం

★వీరు శివదుర్గ దైవశక్తితో కేరళ సమాధి జపం సర్వమంత్ర సిద్ధి పొంది వున్నారు. అఘోర మరియు నాగసాధువులతో కలిసి సాధన పొంది వున్నారు. ఎటువంటి సమస్యలైనా 11 రోజులలో పరిష్కారం, శివం రోడ్. ఫోన్: 9866177085.
NT-326945

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 9949520296.
NT-326937

BUSINESS OFFER

★Wanted Investors for My Client: 1 Lakh to 1 Crore. Contact: A.M.Suree Goud. Legally, Safe, Secure & Dynamic Investment. Advisor, Advocate, Arbitrator & Legal Advisor. 9391665516, 8106826332.
NT-337722

PLOT FOR SALE

★సాగర్ హైవేలో బొంగుళూరు జంక్షన్ ఆదిభట్ల మున్సిపాలిటీ వద్ద HMDA అప్రూవ్డ్ రెడీ టు కన్‌స్ట్రక్షన్ గేటెడ్ కమ్యూనిటీలో ఓపెన్ ప్లాట్లు అమ్మబడును. నియర్ బై TCS, Foxcon. 9000330596.
NT-326638

★సాగర్ హైవే ఫేసింగ్ HMDA ఫైనల్ అప్రూవల్స్‌తో ఇబ్రహీంపట్నం గురునానక్ కాలేజీ దగ్గరలో ప్లాట్లు కలవు. బ్యాంక్ లోన్ లభిస్తుంది. 9959875653, 8688385598.
NT-337373

★శ్రీ బాలాజీ రెసిడెన్సీ @ కేశంపేట, షాద్‌నగర్ DTCP & RERA Aprvd. లేఔట్ Plots గజ